మీ వార్త మాకు పంపండి: 92949 92992

03.06.2024 | కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల

సంపుటి 01 | సంచిక 54

TELANGANA CAPITAL EVENING EDITION

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత

TELANGANA CAPITAL NEWS

సాయంకాల పత్రిక www.telanganacapitalnews.com

పేజీలు 4

# కవితకు బిగ్ షాక్



## నెలరోజుల పాటు ఇక జైలులోనే..

## బెయిల్ నిరాకరించిన కోర్టు

**(తెలంగాణ క్యాపిటల్ న్యూస్, హైదరాబాద్)**

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో అరెస్టై తిహార్ జైలులో శిక్ష అనుభవిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మరోసారి బిగ్ షాక్ తగిలింది. ఢిల్లీ మద్యం విధానం మనీలాండరింగ్ కేసులో కవిత జ్యుడీషియల్ రిమాండ్‌ను మరో నెల రోజుల వరకు పొడిగిస్తూ రౌస్ అవెన్యూ సీబీఐ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. కవితపై ఈడీ, సీబీఐ దాఖలు చేసిన రెండు కేసుల్లో జ్యూడిషియల్ కస్టడీ నేటితో ముగిసింది. దీంతో అధికారులు ఆమెను రౌస్ అవెన్యూ కోర్టు ముందు హజరు పరిచారు. సోమవారం ఉదయం 10 గంటలకు విచారణ చేపట్టిన సీబీఐ కోర్టు, కవిత జ్యూడిషియల్ రిమాండ్‌ను జూలై 3వ తేదీ వరకు పొడగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే ఢిల్లీ మద్యం విధానంలో కవిత పాత్రపై ఈడీ దాఖలు చేసిన సప్లిమెంటరీ చార్జిషీట్‌ను పరిగణలోకి తీసుకున్న ట్రయల్ కోర్టు.. తీహార్ జైలులో ఉన్న కవిత, చరణ్ ప్రీత్‌లకు ప్రొడక్షన్ వారెంట్, మిగిలిన ఇద్దరు నిందితులను కోర్టు ముందు హాజరుకావాలంటూ సమన్లు జారీ చేసింది. చార్జిషీట్ పరిగణనలోకి తీసుకున్న తర్వాత తొలిసారి కవిత ట్రయల్ కోర్టు ముందు హాజరు కానున్నారు.

### మార్చి 15న అరెస్ట్..

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో మార్చి 15న ఈడీ కవితను అరెస్టు చేయగా.. రిమాండ్‌లో ఉండగానే ఏప్రిల్ 11న సీబీఐ ఆమెను అదుపులోకి తీసుకుంది. ఢిల్లీ మద్యం విధానాన్ని తమకు అనుకూలంగా తయారుచేయించి అక్రమార్జన చేశారని కవితపై ఆరోపణలు ఉన్నాయి. మద్యం విధానాన్ని అనుకూలంగా రూపొందించినందుకు ఆప్‌కు కవిత రూ. 100 కోట్ల లంచం ఇచ్చారని సీబీఐ, ఈడీ ఆరోపించింది. రూ.100 కోట్ల లంచం సొమ్మును సౌత్ గ్రూప్ సిండికేట్ నుంచి కవిత వసూలు చేశారని అభియోగం మోపారు. ఈ వ్యవహారంలో పైసా పెట్టుబడి లేకుండానే కవిత ఇండోస్పిరిట్‌లో 33 శాతం వాటా దక్కించుకున్నారని ఆరోపించారు. దీంతో ఆమెను అరెస్టు చేసిన ఈడీ, సీబీఐ అధికారులు కస్టడీకి తీసుకున్నారు.

### ఇప్పటికే చాలా సార్లు బెయిల్ కోసం ప్రయత్నాలు

ఢిల్లీ లిక్కర్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బెయిల్ కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. నేడు రౌస్ అవెన్యూ కోర్టు మరోసారి తీర్పును వెలువరించింది. బెయిల్ నిరాకరిస్తూ తీర్పును వెలువరించారు. ఏప్రిల్ 4న కవిత బెయిల్ పిటిషన్‌పై రౌస్ అవెన్యూ కోర్టు తీర్పు రిజర్వ్ చేసింది. పీఎంఎల్ఏ సెక్షన్ 45 ప్రకారం.. మహిళగా, ఎమ్మెల్సీగా ఉన్నందున.. ముఖ్యంగా తన చిన్న కుమారుడుకి 11వ తరగతి పరీక్షలు ఉన్నందున ఏప్రిల్ 16 వరకూ మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కవిత కోరారు. ఈ మధ్యంతర బెయిల్‌ను ఈడీ వ్యతిరేకించింది. అయితే.. ‘కవిత చిన్నకొడుకు ఒంటరిగా ఏం లేడు. 22 ఏళ్ల సోదరుడు, ఇతర కుటుంబ సభ్యులు తోడుగా ఉన్నాడు. కవితను ఆమె ముగ్గురు సిస్టర్స్ ములాఖత్ అయ్యారు. అబ్బాయి చూసుకోవడానికి కుటుంబ సభ్యులు ఉన్నారు. పరీక్షలు ఉన్నాయని మధ్యంతర బెయిల్ అడుగుతున్నారు. కానీ పరీక్షల్లో కొన్ని ఇప్పటికే అయిపోయాయి. కవిత కుమారుడికి ఎగ్జామ్ యాంగ్జైటీ ఉందని చెప్పడానికి ఎటువంటి ఆధారాలు ఇవ్వలేదు’ అని ఈడీ తరపు న్యాయవాది తెలిపారు.



## మాజీ డీసీపీ రాధాకిషన్ రావుకు

# మాతృ వియోగం

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, కరీంనగర్:** ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితునిగా ఉన్న రిటైర్డ్ డీసీపీ పి.రాధాకిషన్ రావుకు తల్లి మరణించారు. అనారోగ్యంతో బాధ పడుతున్న ఆమె కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం చనిపోయారు. జనగామ జిల్లా చిల్పూరు మండలం పల్లెగుట్టకు చెందిన రాధాకిషన్ రావు పదోన్నతి పొందుతూ డీసీపీ స్థాయికి ఎదిగారు. తెలంగాణ ప్రభుత్వం దర్యాప్తు చేయిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆయన నిందితునిగా ఉన్నారు. ఇటీవలే తన తల్లి అనారోగ్యంతో బాధపడుతున్నారని కోర్టు అనుమతి తీసుకున్న రాధా కిషన్ రావు కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి వచ్చి పరామర్శించారు. 98 ఏళ్ల వయసు ఉన్న సరోజనమ్మ నూరేళ్ల పాటు జీవించాలని కుటుంబ సభ్యులు ఆశించారు. వీరి కుటుంబంలో చాలా మంది దీర్ఘాయుష్ష్యు అందుకున్న వారే కావడంతో సరోజనమ్మ కూడా నిండు నూరేళ్లు బ్రతకాలని వారసులు ఆకాంక్షించారు. అయితే కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న సరోజనమ్మకు కరీంనగర్ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నపటికీ ఫలితం లేకుండా పోయింది. ఆమె మరణించిన సమాచారం అందుకున్న రాధాకిషన్ రావు తన తల్లిని చివరి చూపు చూసేందుకు అనుమతించాలని కోరుతూ కోర్టులో పిటిషన్ వేయించారు. ప్రస్తుతం కరీంనగర్ ఆసుపత్రిలో సరోజనమ్మ మృతదేహాన్ని ఫ్రీజర్‌లో ఉంచారు. కోర్టు ఆదేశాల అనంతరం ఆమె శవాన్ని స్టేషన్ ఘన్ పూర్ సమీపంలోని పల్లెగుట్టకు తీసుకెళ్లనున్నారు. స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించేందుకు బంధువులు ఏర్పాట్లు చేస్తున్నారు.

### రాధా కిషన్ రావుకు బెయిల్

రాధా కిషన్ రావుకు 28 గంటలపాటు కోర్టు బెయిలు మంజూరు చేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితునిగా ఉన్న ఆయన తల్లి సరోజనమ్మ ఆదివారం రాత్రి కరీంనగర్ లోని ఓ ఆసుపత్రిలో మరణించారు. తల్లి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ రాధాకిషన్ రావు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారించిన నాంపల్లి కోర్టు రాధాకిషన్ రావుకు సోమవారం మధ్యాహ్నం 2గంటల నుండి 6 గంటల వరకు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయనను ఈ రోజు సెక్యూరిటీ మధ్య స్వగ్రామమైన జనగామ జిల్లా పల్లగుట్టకు ఆయనను తీసుకెళ్లనున్నారు. తిరిగి మంగళవారం సాయంత్రం 6 గంటల్లోగా రాధాకిషన్ రావును చంచల్ గూడ జైలుకు తరలించాల్సి ఉంటుంది.

## చరిత్రలో ఈ రోజు (జూన్ 3 సోమవారం)

**సంఘటనలు**

**1947:** బ్రిటీషు వైస్రాయి మౌంట్‌బాటన్ స్వాతంత్ర్యానంతరం భారతదేశంలోని స్వదేశ సంస్థానాలకు సార్వభౌమత్వం తొలగించబడుతుందని ప్రకటించాడు.
**1962:** ఫ్రాన్స్ లోని ఓర్లీ విమానాశ్రయం లో బోయింగ్ 707 విమానం దుర్ఘటన.
**1984:** అమృత్‌సర్ లో గల సిక్కుల ప్రసిద్ధ దేవాలయం స్వర్ణదేవాలయం లో ఆపరేషన్ బ్లూస్టార్ మొదలైనది. ఇది జూన్ 6 వరకు జరిగింది.

**జననాలు**

**1726:** జేమ్స్ హట్టన్ స్కాటిష్ తత్వవేత్త మరియు ప్రముఖ ప్రకృతి ప్రియుడు (మ.1797)
**1911:** గుమ్మలూరి సత్యనారాయణ, డెల్టా శిల్పి-ఆర్థర్ కాటన్ అనే ఉద్గ్రంథం వ్రాశారు. రామాయణ హితోపదేశం పేర రామాయణ రహస్యాలను వెలువరించారు.
**1924:** కరుణానిధి, భారత దేశ రాజకీయవేత్త, తమిళనాడు 15 వ ముఖ్యమంత్రి.
**1929:** చిమన్‌భాయి పటేల్, గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి (మ.1994).
**1930:** జార్జి ఫెర్నాండెజ్, భారత రాజకీయవేత్త.
**1952:** బండి నారాయణస్వామి, కథారచయిత, నవలాకారుడు. 'స్వామి' పేరుతో సుప్రసిద్ధుడు.
**1965:** సురీందర్ ఖన్నా, భారత క్రికెట్ జట్టు మాజీ క్రీడాకారుడు.
**1966:** రాధ, భారతీయ సినీనటి.
**1972:** టి.హరీశ్ రావు, తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీకి చెందిన రాజకీయ నాయకుడు.

**మరణాలు**

**1657:** విలియం హార్వే, రక్త ప్రసరణ సిద్ధాంతాన్ని వివరించిన ఆంగ్ల వైద్యుడు. (జ.1578)
**1979:** సంగం లక్ష్మీబాయి, స్వాతంత్ర్య సమరయోధురాలు మరియు భారత లోక్ సభ సభ్యురాలు. (జ.1911)
**1989:** ఇరానీ మతనాయకుడు మరియు పండితుడు ఆయతొల్లాహ్ ఖొమైనీ మరణం (జ.1902).
**2004:** గరిమెళ్ళ రామమూర్తి, నటులు, నాటకసంస్థ నిర్వాహకులు. (జ.1936)
**2007:** రత్నమాల (నటి), నటన సినీ ప్రపంచములో పలువురి మన్ననలను అందుకొన్నది.
**2011:** కరుటూరి సూర్యారావు, కష్టే ఫలీ అనే నానుడి నిజము చేసిన గొప్ప వ్యవసాయ, వ్యాపార, పారిశ్రామిక వేత్త. (జ.1933)
**2016:** ముహమ్మద్ అలీ, విశ్వవిఖ్యాత బాక్సింగ్ ఛాంపియన్ (జ.1942)

సేకరణ : బూట్ల సూర్య ప్రకాష్, బెజ్జంకి

# తొలకరి పలకరించింది..

## సాగుకు సిద్ధం అవుతున్న రైతన్నలు

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, బెజ్జంకి:** వర్షాలు కురుస్తుండడంతో రైతులు వానకాలం సాగు పనుల్లో నిమగ్నమవుతున్నారు. ఈసారి వర్షాలు విస్తారంగా కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొనగా, దానికి అనుగుణంగా విత్తనాలు విత్తుకోవడానికి రైతులోకం సిద్ధమవుతున్నది. రైతులకు సరిపడా విత్తనాలు ఉన్నాయని అటు అధికారులు తెలుపుతున్నారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి రైతులు సాగుకు సమాయత్తమవుతున్నారు. విత్తనాల కోసం ఫెర్టిలైజర్ దుకాణాల దారి పడుతున్నారు రైతులు. కొన్ని గ్రామాల్లో నిన్న కురిసిన వర్షానికి దుక్కులు దున్నుతూ విత్తనాలు వేస్తున్నారు .కొన్ని గ్రామాల్లో దుక్కులు దున్ని చదును చేసి విత్తనాలు పెట్టడానికి సిద్ధంగా ఉంచారు. గత మూడు నెలలుగా పాటు దంచికొట్టిన ఎండలు ఇటీవల కురుస్తున్న వర్షాలకు, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రోహిణి కార్తె ప్రారంభంలోనే వర్షాలు పడడంతో రైతులు బిజీబిజీగా తమ వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. బ్లాక్‌లో విత్తనాలు అమ్మే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించింది. ఆయా మండలాల్లో వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. వర్షాలకు రైతులు దుక్కులు సిద్ధం చేస్తున్నారు. నల్లరేగడి భూముల్లో దుక్కులను సిద్ధం చేసి కొని , రోహిణి పాదంలోనే పత్తి విత్తనాలు, మొక్కజొన్న విత్తనాలు వేయటానికి రైతులు సిద్ధం అవుతున్నారు. వరి పంటతోపాటు మొక్కజొన్న, పత్తి తదితర పంటలను రైతులు ఎక్కువగా సాగు చేస్తారు. వరి పంటకు రోహిణి లేనే నారు మడులు సిద్ధం చేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం వర్షాలు ముందుగా వచ్చాయని వర్షాలు ముందుగా పడడంతో పంటల సాగుకు సిద్ధం చేసుకుంటున్నామని పత్తి, మొక్కజొన్న దుక్కులు దున్నుకొని సదును చేసుకొని విత్తనాలను పెట్టుకుంటున్నామని ఈ సంవత్సరం ముందుగా వర్షాలు పడటంతో సంతోషంగా ఉందన్నారు. పత్తి విత్తనాలు వేస్తున్నామని వర్షాలు పడటంతోనే ఫెర్టిలైజర్ షాప్ లోకి వెళ్లి విత్తనాలు తెచ్చుకున్నామని నిన్న సాయంత్రం కురిసిన వర్షానికి ఉదయాన్నే వచ్చి విత్తనాలు పెడుతున్నామన్నారు. వాన కాలంలో ఈసారి ముందుగా వర్షాలు వచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు.





## తెలుసుకుందాం

**ప్రపంచ సైకిల్ దినోత్సవం**

ప్రతీ ఏడాది జూన్ 3న ప్రపంచ సైకిల్ దినోత్సవం జరుపుకుంటారు. 2018 ఏప్రిల్‌లో ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం ప్రతి సంవత్సరం జూన్ 3 ను ప్రపంచ సైకిల్ దినోత్సవంగా ప్రకటించింది. ప్రపంచ సైకిల్ దినోత్సవం కోసం లెస్జెక్ సిబిల్స్కి అనే సామాజికవేత్త ప్రచారం, తుర్క్మెనిస్తాన్ మరియు 56 ఇతర దేశాల మద్దతు ఫలితంగా జూన్ 03న ప్రపంచ సైకిల్ దినోత్సవం ఏర్పడింది. ప్రొఫెసర్ జాన్ ఇ.స్వాన్సన్ సహకారంతో ఐజాక్ ఫెల్డ్ ప్రపంచ సైకిల్ దినోత్సవం కోసం లోగోను రూపొందించారు. ఇది ప్రపంచవ్యాప్తంగా వివిధ రకాల ద్విచక్రవాహనదారులకు చిహ్నంగా ఉంది. ఈ దినోత్సవం ఎందుకు జరుపుతున్నారు. సైకిల్ అనేది సరళమైన, సరసమైన, నమ్మదగిన మరియు పర్యావరణ అనుకూల రవాణా మార్గంగా చెప్పవచ్చు. సైకిల్ అభివృద్ధికి ఒక సాధనంగా, విద్య, ఆరోగ్య సంరక్షణ మరియు క్రీడలు నిర్వహించేందుకు కూడా ఉపయోగపడుతుంది. సైకిల్ వాడకం వినియోగదారుకు స్థానిక వాతావరణం గురించి తక్షణ అవగాహన కల్పిస్తోంది. సైకిల్ స్థిరమైన రవాణాకు ఉపయోగ కరమైనదే కాకఇంధన ఆదాకు ఉపయుక్తమైనది.

**ప్రాముఖ్యత**

సమాజంలో సైక్లింగ్ సంస్కృతిని అభివృద్ధి చేయడానికి మరియు ప్రోత్సహించడానికి కావల్సిన ఉత్తమ పద్ధతుల ను, సరైన మార్గాలను అవలంబిం చేలా సభ్య దేశాలను ప్రోత్సహిస్తుంది. రహదారి భద్రతను మెరుగుపరచడానికి సభ్యదేశాలను ప్రోత్స హించటమే కాక, పాదచారుల భద్రతను కాపాడటానికి సైకిల్ వాడకాన్ని ప్రోత్సహిస్తుంది. శారీరక శ్రమను బలోపేతం చేయడానికి, వ్యాధులను నివారించడానికి, సహనాన్ని ప్రోత్సహించడానికి, పరస్పర అవగాహనకు , సామాజిక దూరాలను సులభతరం చేయడానికి సాధనంగా సైకిల్ వాడ కం గురించి నొక్కి చెప్పడమే ఈ దినోత్సవం ముఖ్యోద్దేశం.


సేకరణ : బూట్ల సూర్య ప్రకాష్, బెజ్జంకి



# సాయికిరణ్ సేవలు రాష్ట్రానికి అవసరం..

## సీఎం రేవంత్ రెడ్డి .. కలిసిన సివిల్స్ ర్యాంకర్ సాయి కిరణ్

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, రామడుగు:** సాయికిరణ్ సేవలు రాష్ట్రానికి అవసరమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెలిచాల గ్రామానికి చెందిన నందాల సాయి కిరణ్ ఇటీవల యూపీఎస్సీ విడుదల చేసిన సివిల్స్ ఫలితాల్లో ఆల్ ఇండియా 27వ ర్యాంకు సాధించారు. కాగా సోమవారం చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హైదరాబాదులోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సాయికిరణ్‌ను సీఎం శాలువాతో సన్మానించి అభినందించారు. భవిష్యత్తులో ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని సూచించారు.





# కౌంటింగ్‌కు అంతా రెడీ..

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్లు..**

**4వ తేదీ ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం..**

**మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు 8:30 గంటల నుంచి ఈవీఎంల ఓట్ల లెక్కింపు..**

**కౌంటింగ్ సిబ్బంది రాండమైజేషన్ పూర్తి..**

**సీపీ అభిషేక్ మోహంతి ఆధ్వర్యంలో భద్రత**

**కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, అబ్జర్వర్లు**



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, కరీంనగర్:** ఈనెల 4వ తేదీ మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపునకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సారథ్యంలో యంత్రాంగం సర్వం సిద్ధం చేశారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టారు. ఈ నెల 13వ తేదీన పార్లమెంటు ఎన్నికల పోలింగ్ జరిగింది. మొత్తం 28 మంది అభ్యర్థులు పోటీ చేశారు. పార్లమెంట్ పరిధిలో మొత్తం 17,97,150 మంది ఓటర్లు ఉండగా, 13,03,690 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ శాతం 72.54 నమోదయింది. వయోవృద్ధులు దివ్యాంగులు 1625 మంది ఉండగా, హోమ్ ఓటింగ్ ద్వారా 1560 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ సిబ్బంది 10, 200 మంది ఉండగా 8,811 మంది, సర్వీస్ ఓటర్స్ 1018 మంది ఉండగా, 476 మంది ఓటు హక్కు సద్వినియోగం చేసుకున్నారు. పోలింగ్ పూర్తయిన తర్వాత 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలను కరీంనగర్ లోని ఎస్ఆర్ఆర్ డిగ్రీ కాలేజీలో స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. ఈ మేరకు ఎస్ఆర్ఆర్ కాలేజీలో ఓట్ల లెక్కింపునకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సారథ్యంలో అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల కమిషన్ సూచించిన నిబంధనల మేరకు సర్వం సిద్ధం చేశారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు వేరువేరుగా ఓట్ల లెక్కింపును నిర్వహించనున్నారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో 395 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 18 టేబుల్స్ 22 రౌండ్లు, చొప్పదండి లోని 327 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 14 టేబుల్స్, 24 రౌండ్లు, వేములవాడ లోని 260 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 14 టేబుల్స్ 19 రౌండ్స్ వారీగా ఓట్లను లెక్కించనున్నారు. సిరిసిల్ల 287 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 14 టేబుల్స్ 21 రౌండ్స్, మానకొండూర్ 316 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 14 టేబుల్స్ 23 రౌండ్స్, హుజురాబాద్ 305 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 14 టేబుల్స్ 22 రౌండ్స్, హుస్నాబాద్ 304 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 14 టేబుల్స్ 22 రౌండ్ల వారీగా ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. ఆయా నియోజకవర్గాలకు సంబంధించి ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. కౌంటింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఆయా పార్టీల అభ్యర్థులు, ఏజెంట్ల కోసం సీట్లు కేటాయించారు. లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. విద్యుత్తు నిరంతరయంగా ఉండేలా చర్యలు అధికారులు తీసుకుంటున్నారు. కౌంటింగ్ కోసం సిబ్బందిని నియోజకవర్గంలో వారీగా సైతం అలాట్ చేశారు. దీనికోసం సెకండ్ రాండనైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ పమేలా ఆధ్వర్యంలో నిర్వహించారు. కౌంటింగ్ సూపర్వైజర్స్ 124 మంది, కౌంటింగ్ అసిస్టెంట్లు 124, మైక్రోఅబ్సర్వర్లు 124 మందిని కేటాయించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు కౌంటింగ్ సూపర్వైజర్స్ 21, కౌంటింగ్ అసిస్టెంట్లు 35, మైక్రో అబ్జర్వర్లు 14 మందిని అలాట్ చేశారు. మంగళవారం ఉదయం 6 గంటలకు వీరిని టేబుల్స్ వారీగా కేటాయించనున్నారు. వీరందరికీ ఇప్పటికే ఓట్ల లెక్కింపుపై శిక్షణ ఇచ్చారు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించనున్నారు. ఎనిమిదిన్నర గంటల నుంచి ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఎన్నికల ఫలితాలను రౌండ్ల వారీగా ప్రకటించనున్నారు. ఈ మేరకు ఎప్పటికప్పుడు ఫలితాలను ఎన్నికల కమిషన్ వెబ్సైట్ తో పాటు ఎంకోర్ సాఫ్ట్వేర్ లో నమోదు చేయనున్నారు. కరీంనగర్ సీపీ అభిషేక్ మోహంతి ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రత ఏర్పాటు చేశారు. కౌంటింగ్ సందర్భంగా ఏలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మంగళవారం 144 సెక్షన్ అమలు చేయనున్నారు. ఉదయం 6 గంటల నుంచి కౌంటింగ్ ముగిసే వరకు ఎస్ఆర్ఆర్ డిగ్రీ కాలేజీ ఎదుట ఉన్న రోడ్డుపై రాకపోకలకు అనుమతి లేదు. ఈ మేరకు పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. రాజకీయ పార్టీలకు చెందిన ఏజెంట్లకు గుర్తింపు కార్డులను అందిస్తున్నారు. గుర్తింపు కార్డులు లేని ఏజెంట్లు, సిబ్బందిని అనుమతించేది లేదని అధికారులు సూచించారు. సోమవారం ఎస్ ఆర్ ఆర్ డిగ్రీ కళాశాలలో కౌంటింగ్ సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పమేలా సాధారణ ఎన్నికల పరిశీలకులు అమిత్ కటారియా, కౌంటింగ్ పరిశీలకురాలు జీ నజ్మాతో కలిసి పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పక్కాగా ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మొత్తానికి ప్రశాంతంగా కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నది.

# మండల సమావేశం వాయిదా



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, బెజ్జంకి:** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు జరగాల్సి ఉండగా, 12 గంటల వరకు కూడా ఎంపీటీసీలు ఎవరు హాజరు కాలేదు. ఒక్క ఎంపీపీ లింగాల నిర్మ ల లక్ష్మణ్ మాత్రమే హాజరు కాగా, వివిధ శాఖల అధికారులు ఎంపీడీవో బండి లక్ష్మప్ప మాత్రమే హాజరయ్యారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నా రు. 12 గంటల అనంతరం ఎంపీపీ నిర్మల అధికా రులను ఉద్దేశించి మాట్లాడుతూ తమ ఎంపీటీసీ లందరికీ గత పది రోజులక్రితం చెప్పటం జరిగిం దని, అయినా ఎవరు హాజరు కాలేదని, మళ్లి త్వర లోనే సమావేశం నిర్వహించ నున్నట్లు తెలిపారు.

**వాయిదాకు కారణం ఏమిటి?**

ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాల్సిన నాయకులు మండల సర్వసభ్య సమావేశానికి హాజరు కాకపోవడం లోని అంతర్యం ఏమిటో తెలియరావడం లేదని పలువురు చర్చించుకోవడం గమనార్హం. బెజంకి మండలంలో 13 ఎంపీటీసీ స్థానాలు ఉండగా వాటిలో 12 ఎంపీటీసీలు బీఆర్ఎస్ పార్టీకి చెందినవారు. ఒకరు మాత్రం బిజెపి సభ్యులు. జెడ్పిటిసి కూడా బీఆర్ఎస్ కు చెందిన వారే. కానీ ఎంపీటీసీలు, జడ్పిటిసి అందరూ కలిసి రాకుండా ఉండడానికి కారణం ఏమిటని ఆరా తీయగా మండల సమావేశం నిర్వహించి నేటితో మూడు నెలలు పూర్తి అవుతుందని, తప్పకుండా నిర్వహించాలి కాబట్టి , నిర్వహించి వాయిదా వేయాలని, ముందుగానే పథకం ప్రకారం సమావేశాన్ని ఏర్పరిచి, వాయిదా వేసినట్లు తెలియ వచ్చింది. ఇప్పుడు ఎన్నికల కోడ్ ఉన్న దృష్ట్యా, వచ్చే నెల, వారి పదవీకాలం సైతం పూర్తికానున్న దృష్ట్యా, ఈ సమావేశాన్ని వాయిదా వేసి ఎన్నికల కోడ్ ముగియగానే తిరిగి మండల సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని అందరూ ఎంపీటీసీలు ఘనంగా వీడ్కోలు సభను నిర్వహించాలని ఆలోచనకు వచ్చి , సోమవారం జరిగిన సమావేశాన్ని వాయిదా పడేలా చేసినట్లు పలువురు గుసగుసలాడుకోవడం విశేషం. ఈ మేరకు ఎంపీపీ సైతం త్వరలోనే తిరిగి సమావే శాన్ని నిర్వహిస్తామని చెప్పడం జరిగింది కూడా.

**ఎంపిపి వివరణ**


ఈరోజు సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు జన్మదినం ఉన్నందున అందరూ సిద్దిపేట వెళ్లిన దృష్ట్యా సమావేశానికి హాజరు కాలేక పోయారు కావచ్చు నని, అందరూ ఎంపీటీసీ లకు, సమా చారం పది రోజుల క్రితం ఇవ్వటం జరిగిందని ఎంపీపీ లింగాల నిర్మల వివరణను ఇచ్చారు.

# బస్సు ఢీకొని

## ఉపాధ్యాయురాలు మృతి

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, ఇల్లంతకుంట:** సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం లోని శాత్రాజ్ పల్లే జిల్లా పరిషత్ పాఠశాలలో గ్రేడ్ 2 ప్రధానోపాధ్యాయురాలు గా పనిచేస్తున్న టి .సత్యవ్వ గంగాధర వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందడం జరిగింది. వివరాల్లోకి వెళితే.. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో నిర్వహించిన జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని ట్రై బైక్ పై తిరిగి వస్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొని ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా ప్రతిమ హాస్పిటల్ కు తరలించగా మృతి చెందినట్లు సహచరులు తెలిపారు.2000 డీఎస్సీ లో స్కూల్ అసిస్టెంట్ హిందిగా ఇల్లంతకుంట మండలం గాలిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించిన సత్యవ్వ ఆ తర్వాత వెలిచాలకు బదిలీపై వెళ్లి అక్కడ నుండి ఇటీవలే సెప్టెంబర్ లో జరిగిన పదోన్నతుల్లో భాగంగా పదోన్నతిపై గ్రేడ్ -2 ప్రధానోపాధ్యాయులు గా శాత్రాజుపల్లె కు వెళ్లి విధులు నిర్వర్తిస్తున్నది.సత్యవ్వ జన్మ స్థలం ఇల్లంతకుంట మండలం వంతడుపుల గ్రామం కావడం ఈ మండల విద్యార్థులు చాలా మంది విద్యార్థులకు ఆమెతో అవినాభావ సంబందం ఉన్నది.అలాగే ఇటీవలే జనవరి 30 వ తేదిన గాలిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2000-2001 పదవతరగతి కి చెందిన విద్యార్థులు నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమానికి విచ్చేసి విద్యార్థులతో ,అప్పటి ఉపాధ్యాయులతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకొని ఇప్పుడు ఇలా తిరిగిరాని లోకాలకు వెళ్ళడం తో తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు .సత్యవ్వకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.ఎంతోమంది విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పడమే కాకుండా సమాజంలో ఎలా ఉండాలని నేర్పిన మేడం లేరనే సమాచారంతో విద్యార్థులు ఆమె మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు.






# అనసూయ.. అందాలు

అనసూయ భరద్వాజ్ త్రోబ్యాక్ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తన పాత ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో, ఆమె బీచ్‌లో తన సమయాన్ని పంచుకుంది, నెట్టెడ్ స్కర్ట్‌తో జత చేసిన తెల్లటి టాప్ యొక్క స్టైలిష్ సమిష్టిలో ఆనందాన్ని ప్రసరిస్తోంది. అయితే.. ఈ ఆకర్షణీయమైన షాట్‌ల వెనుక ఉన్న ప్రతిభావంతులైన ఫోటోగ్రాఫర్ మరెవరో కాదు, ఆమె భర్త సుశాంక్ భరద్వాజ్.

